# బ్రిక్ దీర్ఘకాలిక లక్ష్యం... బహుళధ్రువ వ్యవస్థ!!

**బ్రిక్- బీఆర్ఐసీ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా)ను తొలుత 2003లో గోల్డ్‌మాన్ శాచెస్ ప్రతిపాదించారు. అధికారికంగా బ్రిక్ దేశాధినేతల తొలి సదస్సు 2009, జూన్16న జరిగింది. ప్రపంచ రాజకీయాల్లో బహుళధ్రువ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈ సదస్సు తన డిక్లరేషన్‌లో ప్రకటించింది. అంతర్జాతీయంగా అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల అసంతృప్తే బ్రిక్ ఏర్పాటుకు దారితీసిందన్నది విశ్లేషకుల అంచనా! , బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా తమ దౌత్యవిధానంలో భాగంగా బీఆర్ఐసీ ఏర్పాటును తెరపైకి తెచ్చాయన్నది విస్పష్టం!!**

''డ్రీమింగ్ విత్ బ్రిక్స్: ద పాత్ టు 2050'' పేరిట గోల్డ్‌మాన్ శాచెస్ ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో బ్రిక్ దేశాల ఆర్థిక సామర్థ్యంపై ప్రధానంగా దృష్టిసారించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా ఒకదానికొకటి పరస్పర ప్రయోజనకారి ఆర్థికవ్యవస్థలని ఈ నివేదిక అభిప్రాయపడింది. భారత్, చైనా తయారీ రంగంలో పటిష్టంగా ఉండగా.. ఆ రెండు దేశాలకు సమృద్ధిగా ముడిసరుకు అందించగల దేశాలు.. బ్రెజిల్, రష్యా. హైడ్రోకార్బన్ల ఉత్పత్తిలో రష్యాది అగ్రస్థానం. కాగా, బయోఫ్యూయల్స్ ఉత్పత్తిలో బ్రెజిల్ ముందంజలో ఉంది. అదేసమయంలో వేగంగా ఆర్థిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్, చైనాలు తమ అవసరాల కోసం ఇంధన వనరుల దిగుమతిలో అందరికంటే ముందుంటున్నాయి. చమురు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న వెనుజులాతో రష్యా, బ్రెజిల్ సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నాయి. ముడిసరుకుల ఉత్పత్తిలో ముందున్న మధ్య ఆసియా దేశాలతో రష్యా, ఇండియా, చైనాలకు స్నేహసంబంధాలుండటం బ్రిక్‌కు కలిసొచ్చే అంశం. 2050 నాటికల్లా బ్రిక్ దేశాల ఆదాయం.. జీ-6 దేశాలైన అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీల సంపదను మించిపోనుందని గోల్డ్‌మాన్ శాచెస్ పేర్కొంది.

## బ్రిక్ ప్రాధాన్యత:

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, అంతర్జాతీయ ఫైనాన్షియల్ సిస్టమ్ దిశను మార్చే సత్తా బ్రిక్‌కు ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రపంచ జనాభాలో, ఉత్పత్తిలో 40 శాతం కలిగున్న బ్రిక్.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేయగలిగే స్థితిలో ఉందని భారత ప్రధాని మన్మోహన్ సింగ్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక మాంద్యానికి కారణాలు.. ఆర్థిక మాంద్యం ప్రభావం, పరిణామాలపై బ్రిక్ దేశాలకు పూర్తి అవగాహన ఉంది. తాజా సంక్షోభాన్ని సానుకూలంగా మార్చుకొని... ప్రపంచ ఫైనాన్షియల్ వ్యవస్థకు కొత్త రూపు ఎలా ఇవ్వాలి?అనే అంశంతో పాటు ఉమ్మడి ప్రయోజనాల సాధన దిశగా కృషిచేసే విషయంలోనూ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాల మధ్య ఏకాభిప్రాయం ఉంది. అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థను స్థిరీకరించేందుకు వీలుగా బ్రిక్ కొన్ని అంతర్జాతీయ రాజకీయ బాధ్యతలను కూడా స్వీకరించాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## విదేశాంగ మంత్రుల సదస్సు:

బ్రిక్ విదేశాంగ మంత్రుల తొలి అధికారిక సదస్సు రష్యాలోని యాకెతిరిన్‌బర్గ్‌లో 2008, మే 16న జరిగింది.

**ఈ సదస్సు అజెండా– ఆర్థిక అంశాలు, సహకారం.**

ఈ సదస్సు... బ్రిక్‌ను ఒక గ్రూప్‌గా వ్యవస్థీకృతం చేసింది. రెగ్యులర్‌గా కలుస్తుండాలని ఆయా దేశాల విదేశాంగ మంత్రులు నిర్ణయించడమే ఇందుకు నిదర్శనం. ప్రపంచ రాజకీయాల్లో బ్రిక్‌ను ఒక ప్రభావశీల గ్రూప్‌గా తీర్చిదిద్దాలని విదేశాంగ మంత్రుల సదస్సు నిర్దేశించుకుంది. అంతర్జాతీయంగా ఉమ్మడి నాయకత్వం ఉండేలా కృషి చేయాలని నిర్ణయించింది. బ్రిక్ పరస్పర ఆధారిత ఆర్థిక వ్యవస్థల వేదికని భారత విదేశాంగ మంత్రి ప్రణబ్‌ముఖర్జీ అభిప్రాయపడ్డారు. ఇంధనం, ఆహార భద్రతను కాపాడటం.. ఉగ్రవాదంపై పోరు, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు బ్రిక్ ద్వారానే సాధ్యమన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు, ప్రగతికి బ్రిక్ కృషి చేస్తుందని రష్యా విదేశాంగ మంత్రి సెరిగిరి లావ్‌రో పేర్కొన్నారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా.. ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశాలని... వీటి మధ్య పరస్పరం అనేక ఉమ్మడి ప్రయోజనాలున్నాయన్నారు.

## సంయుక్త ప్రకటన:

- అంతర్జాతీయ వ్యవహారాల్లో ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషించాలి. చట్ట న్యాయం, బహుళ దౌత్యవ్యవస్థలు పునాదులుగా అంతర్జాతీయ వ్యవస్థను మరింత ప్రజాస్వామ్యయుతంగా మార్చాలి.
- సమన్యాయ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ద్వారా మాత్రమే పేదరికం, ఆకలి, అనారోగ్యాలను పూర్తిగా నివారించగలం.
- దేశాల మధ్య వివాదాలను రాజకీయ, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించాలి.
- అంతర్జాతీయ భద్రత విషయంలో సహకార ధోరణి అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- అంతరిక్షంలో ఆయుధపోటీని నియంత్రించేందుకు బహుముఖ కృషి అవసరం.

## తొలి అధికారిక సదస్సు:

బ్రిక్ దేశాధినేతల తొలి అధికారిక సదస్సు.. రష్యాలోని యాకెతి రిన్ బర్గ్‌లో 2009, జూన్16న జరిగింది. బ్రెజిల్ అధ్యక్షుడు లుయిస్ ఇనాసియో లులాడ సిల్వా, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్, భారత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, చైనా అధ్యక్షుడు హు జింటావో ఈ సదస్సులో పాల్గొన్నారు.

## డిక్లరేషన్:

- అంతర్జాతీయ ఫైనాన్షియల్ వ్యవస్థలో సంస్కరణలకు బ్రిక్ దేశాలు కట్టుబడి ఉన్నాయి. అంతర్జాతీయ

ఫైనాన్షియల్ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రాతినిధ్యం పెరగాలి. వర్ధమాన దేశాల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అంత ర్జాతీయ ఫైనాన్షియల్ సంస్థల అధిపతులను పూర్తిగా పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి, నియమించాలి.

- సుస్థిర, వాస్తవ, బహువిధ అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ ఏర్పాటు అవసరం ఎంతో ఉంది.
- ఆర్థిక రక్షణ విధానాల పట్ల వ్యతిరేకత ప్రకటించడం.. డబ్ల్యూటీవో దోహా రౌండ్ ఫలితం సమగ్రంగా, సమతౌల్యంగా ఉండేట్లు చూడటం.. ఇంధన రంగంలో సహకారం.. తక్షణ లక్ష్యాలు.
- అన్నిరకాల ఉగ్రవాద చర్యలను బ్రిక్ సంయుక్త ప్రకటన గట్టిగా ఖండించింది. ఉగ్రవాదం ఎక్కడున్నా.. ఏ రూపంలో ఉన్నా.. అది పూర్తిగా గర్హనీయమని పేర్కొంది.
- ఐక్యరాజ్యసమితిలో సమగ్ర సంస్కరణలు తక్షణ అవసరం. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్‌కు, బ్రెజిల్‌కున్న ప్రాధాన్యతను బ్రిక్ పునరుద్ఘాటించింది. ఈ రెండు దేశాలు ఐక్యరాజ్యసమితి వ్యవహారాల్లో ముఖ్యభూమిక పోషించాలని పేర్కొంది.
- అంతర్జాతీయ ఆహార భద్రతపైనా బ్రిక్ సంయుక్త ప్రకటన స్పందించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వినియోగం పెరగడమే ఆహార ధాన్యాల ధరల పెరుగుదలకు ప్రధాన కారణమనే వాదన అసలు సమస్యను పక్కదారి పట్టించిందని పేర్కొంది. ఆహార భద్రత సమస్య చాలా క్లిష్టమైందని అభిప్రాయపడింది. వ్యవసాయ రంగంలో సబ్సిడీల నియంత్రణ కోసం డబ్ల్యూటీవో దోహా రౌండ్ చర్చలను వేగవంతం చేయాలని సూచించింది.

## ప్రధానమంత్రి ప్రసంగం:

- అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో.. జీ-20 సదస్సులో.. వివిధ దేశాల మధ్య సహకార ధోరణిని పెంపొందించడంలో బ్రిక్ దేశాలు సఫలీకృతమయ్యాయంటూ.. ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ప్రశంసించారు. అన్నిటికంటే ముఖ్యంగా సదస్సులో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలన్నారు. ఇటీవల కాలంలో బ్రిక్ దేశాల మధ్య వాణిజ్యం వృద్ధి చెందిందని, పెట్టుబడులు పెరిగాయని తెలిపారు.
- వ్యవసాయం, విమానయానం, ఇంధనం, ఫార్మాస్యూటికల్ రంగాల్లో సహకారం కోసం బ్రిక్ సంయుక్త ఫోరం ఏర్పాటును మన్మోహన్ సమర్థించారు.

## రాజకీయాంశాలపై చర్చ:

- వివిధ అంతర్జాతీయ సంస్థలు విఫలమవడం.. ప్రపంచంలో అనేక కీలక పరిణామాలు సంభవిస్తున్న తరుణంలో బ్రిక్ సదస్సు జరగడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని బ్రెజిల్ అధ్యక్షుడు లుయిస్ ఇనాసియో లులా డా సిల్వా పేర్కొన్నారు.
- అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో.. బ్రిక్ సదస్సు జరగడం, అంతేకాకుండా బ్రిక్ సభ్యదేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా నేతల మధ్య చర్చలు అత్యంత కీలక మని భారత

విదేశాంగ కార్యదర్శి శివశంకర్ మీనన్ అభిప్రాయపడ్డారు.

- బ్రిక్ సదస్సు విస్తృత అజెండా ఆర్థిక సహకారం దిశగా వివిధ మార్గాల అన్వేషణకు దోహదం చేసిందని మీనన్ పేర్కొన్నారు. రాజకీయ అంశాలపైనా బ్రిక్ నేతలు విస్తృతంగా చర్చించారని ఆయన తెలిపారు.

## లోపాలు:

- బ్రిక్ సభ్యదేశాలు అత్యంత వేగంగా ఆర్థిక ప్రగతిని నమోదు చేసుకుంటున్నప్పటికీ.. ఆయా దేశాల మధ్య ఉమ్మడి అంశా లు తక్కువేనని చెప్పొచ్చు.
- మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక వంటి ఉపఖండ దేశాల్లో.. తన పలుకుబడి పెంచుకునేందుకు చైనా ప్రయత్నిస్తుండటంతో.. భారత్, చైనాల మధ్య అపనమ్మకాలు, స్పర్థలు నెలకొన్నాయి.
- జీ-8 దేశాల్లా కాకుండా... బ్రిక్ దేశాలకు భిన్న నాగరికతల నేపథ్యం ఉంది. అంతేకాదు.. పూర్తిగా భిన్నమైన ఆర్థిక విధానాల పరంపర కూడా ఈ దేశాల సొంతం.

## బ్రిక్ విజయానికి దోహదం చేసేవి:

బ్రిక్ విజయవంతం కావడం ముఖ్యంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. అవి...

- అంతర్జాతీయ ఆర్థిక సంస్థల పనితీరును మరింత పారదర్శకంగా మార్చడం.. దాంతోపాటు ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరాన్ని రష్యాలోని యాకెతిరిన్ బర్గ్‌లో జరిగిన బ్రిక్ సదస్సు సంయుక్త ప్రకటన స్పష్టం చేసింది. అంతేకాకుండా.. అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థను సుస్థిర పరచడం.. బహువిధం(డైవర్సిఫై) చేయాల్సిన అవసరాన్ని కూడా సదస్సు నొక్కి చెప్పింది. డబ్ల్యూటీవో దోహా రౌండ్ చర్చలు అందరికీ ఆమోదయోగ్య రీతిలో బ్యాలెన్స్‌డ్‌గా ముగిసేలా చూడాలని సూచించింది.
- బ్రిక్ దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, వాణిజ్య సంబంధాల నేపథ్యంలో.. అంతర్గతంగా బ్రిక్ పటిష్టమైన, ఏకీకృత వ్యవస్థని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
- రాజకీయంగా కూడా పారదర్శక, సమతుల్య అంతర్జాతీయ వ్యవస్థ అవసరాన్ని బ్రిక్ గుర్తించింది. అనేక రాజకీయ సంక్షోభాలు న్యాయబద్ధంకాని అంతర్జాతీయ వ్యవస్థ వల్లనే ఉత్పన్నమవుతాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.
- అంతర్జాతీయంగా బహుళ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తూనే... ప్రపంచ ఆర్థిక, ద్రవ్య, పర్యావరణ సమస్యలపై బ్రిక్ దృషిసారించే అవకాశముంది!!

## ఉమ్మడి అజెండా:

- ఆహార భద్రత.
- ఫైనాన్షియల్ సంస్కరణలు.
- బహువిధ (డైవర్సిఫైయిడ్) అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థ ఏర్పాటు.
- ప్రజాస్వామ్యయుత, బహుళ ధ్రువ అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పాటు.